## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న నారాయణస్వామి

**ఆలూరు:** ఆస్పరి మండలం నగరూరు గ్రామంలో కొలువుదీరిన శ్రీ సద్గురు మహాదేవప్ప తాత ఆలయం నిర్వహణ ఖర్చులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గుమ్మనూరు నారాయణస్వామి బుధవారం రూ.75 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలిపి ఘనంగా సత్కరించారు. సర్పంచ్ సావిత్రమ్మ, ఉపసర్పంచ్ లెస్సన్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

### అనుచిత వ్యాఖ్యలు తగదు



చిప్పగిరిలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

**చిప్పగిరి:** నిస్వార్థంగా సేవలందిస్తున్న గ్రామ వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ అన్నారు. బుధవారం మండల వలంటీర్ల ఆధ్వర్యంలో.. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక అంబేడ్కర్ కూడలిలో నిరసన చేపట్టారు. అనంతరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### 'జగనన్న గోరుముద్ద'తో ఆరోగ్యం

**తుగ్గలి:** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్న గోరుముద్ద' పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం లభిస్తోందని మండల ప్రత్యేక అధికారి జాకీర్‌హుసేన్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. భోజనం, చిక్కీల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. అనంతరం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ డీఈ విజయకుమార్‌తో చర్చించారు. సచివాలయాన్ని సందర్శించి అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. ఎంఈఓలు మాలతి, రామ వెంకటేశ్వర్లు ఉన్నారు.

### పొరపాట్లకు తావివ్వొద్దు




మాట్లాడుతున్న పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్

**కృష్ణగిరి:** ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులను పక్కాగా చేపట్టాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ ఆదేశించారు. కృష్ణగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం ఆయన బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ప్రతిఒక్కరూ ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితా మార్పులు, చేర్పులను గుర్తించాలన్నారు. అక్టోబర్ 28, 29, నవంబర్ 18, 19 తేదీల్లో స్పెషల్ క్యాంపులు ఉంటాయని వీటిల్లో కొత్తగా ఓటరు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. తహసీల్దార్ పురుషోత్తం, ఎలక్షన్ డీటీ శ్రీనివాసరావు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

**గోనెగండ్ల:** ఏ ఒక్కరూ తమ ఓటు హక్కు కోల్పోకుండా ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని తహసీల్దార్ వేణుగోపాల్ బీఎల్ఓలను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణలపై బీఎల్ఓలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎలక్షన్ డీటీ గురురాజారావు, డీటీలు లక్ష్మిరాజు, రాఘు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలపై సమీక్ష



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ రమాదేవి

**మద్దికెర:** మండలంలో జరుగుతున్న అభివృద్ధి పథకాలపై కర్నూలు డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రమాదేవి బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పక్కా నిర్మాణం, జగనన్న సురక్ష, రీ భూసర్వే, రోడ్లు, నీటి పథకాల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదిక పంపాలన్నారు. పాఠశాలల్లో డ్రాపౌట్స్ లేకుండా చూడాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓలు పాల్గొన్నారు.

### పారదర్శకంగా 'సురక్ష'



రైతుకు కౌలుకార్డు అందజేస్తున్న అధికారులు

**నందవరం:** 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా అందిస్తున్నట్లు తహసీల్దార్ నిత్యానందరాజు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని టి. సోమలగూడూరు, పొనకలదిన్నె గ్రామ సచివాలయాల్లో మండల అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు కుల, ఆదాయ, కౌలుకార్డు, ఆధార్, రేషన్ కార్డు తదితర సేవలను అందించారు. గ్రామ సచివాలయం–1లో 560, గ్రామ సచివాలయం–2లో 275 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు మాధవి, జైపాల్ రెడ్డి, నాగరాజు, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, డిప్యూటీ తహసీల్దార్ రఘువీర, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా అగ్రిల్యాబ్‌లు

- నియోజకవర్గానికో ల్యాబ్
- నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులకు కళ్లెం
- విస్తృతంగా నాణ్యతా పరీక్షలు



మంత్రాలయం వైఎస్సార్ అగ్రిల్యాబ్

**ఎమ్మిగనూరు:** వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. విత్తనం మొదలు పంట విక్రయాల వరకూ రైతన్నకు దన్నుగా నిలుస్తోంది. పెట్టుబడి సాయం, సబ్సిడీతో విత్తనాలు, ఎరువుల సరఫరా, ఉచితంగా పంట బీమా, పంట దిగుబడులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తోంది. వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులకు యంత్ర సామగ్రిని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోంది. అలాగే రైతులకు కల్తీ విత్తనాలు, నకిలీ ఎరువుల బెడద తప్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఒక అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ఏర్పాటుచేసిన వైఎస్సార్ అగ్రిల్యాబ్‌ల ద్వారా విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్షిస్తూ రైతన్నకు అండగా నిలుస్తోంది.

**నియోజకవర్గానికో అగ్రిల్యాబ్ ఏర్పాటు**

కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, కర్నూలులో మాత్రమే ఇంటిగ్రేడ్ ల్యాబ్‌లు అందుబాటులో ఉండేవి. ప్రతి నియోజకవర్గంలో ఒక అగ్రిల్యాబ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో గతేడాది ఆదోని, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండలో అగ్రిల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరులో ఈనెల 8న అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఒక్కో అగ్రిల్యాబ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.55 లక్షలు ఖర్చుచేసింది. ప్రతిల్యాబ్‌కు ఏఓ, ఇద్దరు ఏఈఓలను నియమించింది. గూడూరు మినహా మిగతా అగ్రిల్యాబ్‌లలో విత్తనాలు, రసాయన ఎరువుల పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**రైతులకు మరింత మేలు**

వైఎస్సార్ అగ్రిల్యాబ్‌ల ఏర్పాటుతో రైతు ప్రయోజనాలు విస్తృతమయ్యాయి. ప్రభుత్వం ఇప్పటికే నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడీతో రైతులకు సరఫరా చేస్తోంది. అవి గాకుండా రైతులు ప్రైవేట్ వ్యక్తులు, వ్యాపారుల వద్ద కొనుగోలు చేసే వివిధ రకాల పంట విత్తనాలు, ఎరువుల నాణ్యతను అగ్రిల్యాబ్‌లలో ఉచితంగా పరీక్షించుకోవచ్చు. మార్కెట్లోకి వచ్చే ప్రతి విత్తన అవుట్‌పుట్‌ను, అలాగే రైతులు తాము పండించిన పంటలోని విత్తనాల నాణ్యతను పరీక్షించి తిరిగి విత్తుకొనే అవకాశం ఏర్పడింది. మార్కెట్లో కొనుగోలు చేసిన ఏ విత్తనాలనైనా అగ్రిల్యాబ్‌కు వెళ్లి పరీక్షించుకోవచ్చు, అనుమానం వచ్చిన ప్రతి రసాయనిక ఎరువులు, క్రిమీ సంహారక మందులను పరీక్షించుకొని నిర్భయంగా పంట సాగు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

**నాణ్యత పరీక్షలు ఇలా..**

విత్తనాలు, రసాయన ఎరువులను అగ్రిల్యాబ్‌ల్లో పరీక్షించుకోగా, పురుగు మందులను కర్నూలు ల్యాబ్‌కు తరలిస్తారు. అగ్రిల్యాబ్‌లలో విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం, భౌతిక స్వచ్ఛతలను పరీక్షించి



అగ్రిల్యాబ్‌లో విత్తన నాణ్యతా పరీక్షలు

28 రోజుల్లో నివేదిక ఇస్తారు. ఎరువుల్లో ఎన్‌పీకే కాంప్లెక్స్, ఎన్‌పీకే మిశ్రమం, సూక్ష్మ పోషకాల్లో తేమ శాతం, పోషకాల శాతం, కణ పరిణామాలను పరీక్షించి 14 రోజుల్లో రైతులకు నివేదికలు ఇస్తారు. అగ్రిల్యాబ్‌లలో పరీక్షల కోసం నాలుగు రకాలుగా శాంపిల్స్ తీసుకుంటారు. రైతు భరోసా కేంద్రాలనుంచి తీసుకున్న విత్తనాలు, ఎరువులను అగ్రిల్యాబ్‌లలో ఉచితంగానే పరీక్షిస్తారు. అదే ప్రైవేట్ వ్యాపారుల విత్తనాలకు రూ.300, ఎరువులకు రూ.1500 ఫీజు చెల్లించి పరీక్షలు చేయించుకోవాలి.

**పంట నష్టం తగ్గించుకోవచ్చు**



పంటసాగుకు ముందే అగ్రిల్యాబ్‌లలో విత్తనాలు, ఎరువులను పరీక్షించే అవకాశాలు ఉండడం శుభ పరిణామం. దీని వల్ల పంట నష్టాలను తగ్గించుకోవచ్చు. రైతులకు విత్తనాలు, ఎరువుల నాణ్యతపై పూర్తి అవగాహన ఏర్పడుతుంది. – తెలుగు వెంకటేశ్, రైతు, నందవరం

**ప్రభుత్వ తోడ్పాటు బాగుంది**



వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు చాలా బాగుంది. పెట్టుబడి సాయం, పంటల బీమా, గిట్టుబాటు ధరలు అందిస్తోంది. విరివిగా పంట రుణాలు ఇస్తూ, సక్రమంగా చెల్లించిన వారికి వడ్డీ జమ చేయడం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. ఇప్పుడు అగ్రిల్యాబ్‌లలో విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరీక్షించుకొనే వెసలుబాటు శుభపరిణామం. వ్యవసాయానికి అన్ని శుభశకునాలే. – కురువ చంద్రన్న, చిన్నకొత్తిలి

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి**



ఇంటిగ్రేడ్ ల్యాబ్‌లు, అగ్రిల్యాబ్‌ల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పంట సాగుకు ముందే నాణ్యతా పరీక్షలు చాలా మేలు చేస్తాయి. మంత్రాలయం అగ్రిల్యాబ్ ద్వారా ఈ యేడాది ఇప్పటికే 90 విత్తన నాణ్యత పరీక్షలు, 3 రసాయన ఎరువుల పరీక్షలు జరిపారు. – మహ్మద్‌ఖాద్రి, ఏడీఏ

### విద్యాభివృద్ధికి కృషి చేయండి



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని కలిసిన హెచ్‌ఎం చిత్రలేఖ, ఎంఈఓ–2 మధుసూదన్‌రాజు

**ఎమ్మిగనూరుటౌన్:** ఉన్నత పాఠశాలలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని, అంకితభావంతో పని చేసి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు తీసుకొన్న చిత్రలేఖ బుధవారం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రస్తుతం ఉన్న తరగతి గదులు, మౌళిక సదుపాయాలు, నాడు–నేడు కింద చేపట్టిన పనులపై ఎంఈఓ–2 మధుసుదన్‌రాజు, హెచ్‌ఎంతో ఎమ్మెల్యే చర్చించారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సీసీ చంద్రశేఖర్, ఉపాధ్యాయురాలు శ్రీదేవి తదితరులు ఉన్నారు.

### ఇన్‌చార్జ్ ఎంఈఓగా మాలతి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈఓ

**తుగ్గలి:** మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ–1గా మాలతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పత్తికొండ ప్రభుత్వ బాలుర పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆమె ఎంఈఓగా నియమితులయ్యారు. ఈ మేరకు పలువురు ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

## దరఖాస్తుదారులందరికీ ధ్రువపత్రాలు అందాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

**ఆలూరు రూరల్:** జగనన్న సురక్ష పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరికీ ధ్రువ పత్రాలు అందించాలని ఆదోని డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక సచివాలయం–2ను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లను తెలుసుకుని సురక్ష ద్వారా మంజూరు చేయించాలన్నరు. ఇప్పటివరకు మండలంలో 879 సర్టిఫికెట్లు అందించినట్లు అధికారులు ఆయనకు తెలిపారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అల్లబకాష్‌తో కలిసి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

**హొళగుంద:** అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. సచివాలయ నిర్వహణపై సమీక్షించారు.

### సద్వినియోగం చేసుకోండి

**ఎమ్మిగనూరురూరల్:** రైతులు సూక్ష్మ సాగునీటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారిణి ఇందిర పేర్కొన్నారు. బుధవారం కోటేకల్–2 రైతు భరోసా కేంద్రం పరిధిలోని చెన్నాపురం గ్రామంలో రైతులు డ్రిప్ కింద సాగు చేస్తున్న పండ్ల తోటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. బిందు సేద్యం ద్వారా పంటలకు సాగునీటి ఆదా అవుతుందని చెప్పారు. డ్రిప్ పరికరాల కోసం ప్రభుత్వం అందించే సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్‌బీకే ఇన్‌చార్జ్ నాగరాజు, రైతులు వెంట ఉన్నారు.ం

### కృష్ణగిరి ఎస్‌ఐగా ఆర్.సురేష్



ఆర్.సురేష్

**కృష్ణగిరి:** కృష్ణగిరి మండల ఎస్‌ఐగా ఆర్.సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి కర్నూలుకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నంద్యాల త్రీటౌన్ నుంచి ఇక్కడికి వచ్చారు.

## పథకాలను పారదర్శకంగా అందించండి



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల మేనేజర్ ప్రసాద్

**నందవరం:** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పారదర్శకంగా అందించాలని జిల్లా పరిశ్రమ మేనేజర్ ప్రసాద్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో జగనన్న సురక్ష, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు, మన బడి నాడు–నేడు అభివృద్ధి పనులు, అలాగే ఉపాధి పనుల్లో భాగంగా మొక్కల పెంపకం, వైఎస్ఆర్ పాడుపు రుణాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, మన బడి నాడు– నేడు పనులు, ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ఫీవర్ సర్వే, డ్రాప్ అవుట్ చిల్డ్రన్స్ సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. మండల అధికారులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన పరిశీలన

**హొళగుంద:** మండలంలోని అర్లగేరి జెడ్పీహెచ్ఎస్‌లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ప్రత్యేకాధికారి రామాంజనేయులు, ఎంఈఓ ఈరన్న తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారమే భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.

## అవి–ఇవి

### డ్రాపౌట్స్ నివారించండి

**చిప్పగిరి:** మండలంలోని విద్యార్థులు ఎక్కువగా డ్రాప్ అవుతున్న పాఠశాలలపై దృష్టి పెట్టాలని ఎంఈఓ బాలనాయుడును పీఓ, మండల స్పెషల్ ఆఫీసర్ వేణుగోపాల్ ఆదేశించారు. బుధవారం మండలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బడి నుంచి ఎందుకు డ్రాపవుతున్నారో కారణాలు తెలుసుకుని, నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పలు శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్డీ సంజన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంసీలా, ఏపీఎం నాగార్జున, హౌసింగ్ ఏఈ భవ్య, కార్యదర్శులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**ఆలూరు రూరల్:** ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండవ విడత అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ సూరప్ప బుధవారం ప్రకటలో వెల్లడించారు. 2023–24 ఏడాదికిగాను ఖాళీల భర్తీ కోసం దరఖాస్తులు కోరడమైందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ కోసం కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్ మెన్, సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, డ్రస్ మేకింగ్, కంప్యూటర్ కోర్సుల్లో అడ్మిషన్లు ఉన్నాయన్నారు.

### ఓటర్ల పరిశీలన పకడ్బందీగా చేపట్టాలి

**ఆస్పరి:** మండలంలోని గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పరిశీలన పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ కుమారస్వామి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో 67 పోలింగ్ కేంద్రాలు 51 వేల మంది ఓటర్లు ఉన్నారన్నారు. బీఎల్ఓలు ఓటరు జాబి తాను తీసుకుని చనిపోయిన వారు, గ్రామాలలో లేని వారిని విచారించాలన్నారు. అవకతవకలకు తావులేకుండా పరిశీలన చేయాలన్నా రు. ఆలూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి మల్లికార్జున, డీటీ గాయత్రి పాల్గొన్నారు.

### నర్సరీల తనిఖీ

**వెల్దుర్తి:** రామళ్లకోట గ్రామంలో షేడ్ నెట్ సెంటర్‌లలో నిర్వహిస్తున్న ప్రైవేట్ నర్సరీలను బుధవారం కర్నూలు ఉద్యానశాఖాధికారి విజయలక్ష్మి తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలనానంతరం ఆమె యజమానులతో మాట్లాడుతూ.. మేలు రకమైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కూరగాయల మొక్కలు, నారు కొన్న రైతులకు కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. వీహెచ్‌ఏ సాంబశివుడు వెంట ఉన్నారు.

### భూసర్వేతో వివాదాల పరిష్కారం

**మద్దికెర:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ భూసర్వేతో ఎన్నో ఏళ్లుగా ఉన్న వివాదాలు పరిష్కారమవుతాయని డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, మార్కెట్ యార్డు డైరెక్టర్ భద్రయ్య అన్నారు. బుధవారం మండలపరిధిలోని బసినేపల్లి గ్రామంలో రీసర్వే పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. భూములను ఉచితంగా సర్వే చేసి యజమానులకు హక్కు పత్రాలు అందిస్తామన్నారు. రీసర్వే డీటీ ధనుంజయ, వీఆర్వోలు పాల్గొన్నారు.

## నిజమైన సేవకులు

### నా బిడ్డకు కడుపు నింపుతోంది



తల్లి జోగి ఉరుకుందమ్మ ఒడిలో దివ్యాంగ బాలుడు లోకేష్

ఈ చిత్రంలో తల్లి ఒడిలో ఉన్న బాలుడి వయసు పదేళ్లు. పత్తికొండలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన జోగి చిన్న ఉరుకుందు, మాలమ్మ దంపతులకు లోకేష్, విఘ్నేశ్వరి, ధనరాజ్, వెంకట్ సంతానం. తండ్రి ఉరుకుందు మొబైల్ క్యాంటీన్‌లో వర్కర్, తల్లి గంప నెత్తిన పెట్టుకుని ఊరూరా తిరుగుతూ అద్దాలు, దువ్వెనలు, పూసలు అమ్ముతుంది. పెద్ద కొడుకు పుట్టినప్పటి నుంచి శారీరక వైకల్యంతోనే ఉన్నాడు. పదేళ్ల వయసొచ్చినా నడవలేడు, కూర్చోలేడు. మంచానికే పరిమితం. అన్నం జీర్ణం కాకపోవడంతో పాలు మాత్రమే తాగిస్తూ కన్నబిడ్డను బతికించుకుంటున్నారు. పిల్లాడి పాలకే రోజుకు రూ.200 వరకు ఖర్చవుతుంది. వీరిద్దరి రెక్కల కష్టమే పిల్లల కడుపు నింపేది. అద్దె ఇంట్లో దయనీయ స్థితిలో ఉన్న వీరికి గత ప్రభుత్వంలో పింఛన్ కూడా వచ్చేది కాదు. వీరికి వలంటీర్ రెహానా చొరవతో దివ్యాంగ పింఛన్ మంజూరైంది. కుటుంబానికి ఆర్థిక ఆసరా లభిస్తోంది. –పత్తికొండ రూరల్

**వలంటీర్ చొరవతోనే పింఛన్**

నా కుమారుడికి పదేళ్ల వయసొచ్చినా శారీరక ఎదుగుదల లేదు. పాలు మాత్రమే తాగగలడు. గతంలో పిల్లాడికి పింఛన్ కూడా లేదు. మా వలంటీర్ షేక్ రెహానా చొరవతో నా కుమారుడికి వికలత్వ పింఛన్ మంజూరైంది. ఆమె ఓ రోజు పిల్లాడిని చూసి పింఛన్ రావడం లేదా అని అడిగింది. రావట్లేదని చెబితే వెంటనే రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు ఇతర జిరాక్స్ పత్రాలు ఇప్పించుకుని దరఖాస్తు చేయించింది. మరుసటి నెల నుంచే పింఛన్ మంజూరైంది. రెండేళ్ల నుంచి పింఛన్ తీసుకుంటున్నాం. మా పిల్లాడి పోషణకు పింఛన్ సొమ్ము ఎంతో ఉపయోగపడుతుంది. మా వలంటీర్ చొరవ వల్లనే పింఛన్ సొమ్ము నా కొడుకు కడుపు నింపుతుంది. – జోగి ఉరుకుందమ్మ, పత్తికొండ

### నిజమైన కోవిడ్ వారియర్స్



కోవిడ్ సమయంలో ఆలూరులో ఫీవర్ సర్వే చేస్తున్న వలంటీర్ గౌసియా, అంజలి (ఫైల్)

ఈ చిత్రంలో ఆశావర్కర్లతో పాటు కోవిడ్ సమయంలో ఫీవర్ సర్వే చేస్తున్న వలంటీర్లు ఆసియా, అంజలీ. 2020 ఏప్రిల్‌లో కోవిడ్ వల్ల లాక్‌డౌన్ విధించారు. కరోనా మహమ్మారి విజృంభిస్తోంది. దేశం నలుమూలల నుంచి ప్రజలు వారి స్వగ్రామాలకు వస్తున్నారు. ఎవరికి కరోనా లక్షణాలు ఉన్నాయో.. లేదో తెలియని పరిస్థితి. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సిబ్బంది, వలంటీర్ల ద్వారా ఫీవర్ సర్వే చేయించింది. ఆలూరుకు చెందిన మహిళా వలంటీర్లు ఆసియా, అంజలి కోవిడ్‌ను లెక్కచేయకుండా వైద్యారోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేశారు. కోవిడ్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ.. ప్రజలను అప్రమత్తం చేశారు. కోవిడ్ బారిన పడి హోం క్వారంటైన్‌లో ఉన్నవారి ఆరోగ్య పరిస్థితులు తెలుకుని ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేశారు. మందులు అందించారు. ఆ రోజుల్లో వారు చేసిన కృషిని ప్రజలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటూ.. వలంటీర్లు నిజమైన కోవిడ్ వారియర్స్ అని కితాబిస్తున్నారు. – ఆలూరు రూరల్

**కుటుంబ సభ్యురాలిలా చూసుకున్నారు**



కరోనా సమయంలో మా పరిధిలో ఉన్న వలంటీర్లు ఆసియా, అంజలీ తమను కుటుంబ సభ్యుల్లాగా చూసుకున్నారు. వారి సేవలు అమోఘం. లాక్‌డౌన్‌లో రోజు విడిచి రోజు ఇంటికి వచ్చి మా ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని వెళ్లేవారు. కరోనాతో భయపడుతున్న మాకు మనోధైర్యాన్ని నింపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తులను కలవరాదని చెప్పేవారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, నిత్యావసర సరుకులు అందించి కుటుంబ సభ్యులుగా చూసుకున్నారు. అప్పట్లో వారు చేసిన సేవలు మరువలేనివి. – శారదమ్మ, ఆలూరు,

## ప్రజా సంక్షేమమే ధ్యేయం



తాగునీటి పథకానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**మద్దికెర:** ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయో? లేదో? తెలుసుకొని అర్హులైన వారికి అందకపోతే లబ్ధి చేకూర్చేలా గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలోని ఎం.అగ్రహారం, మద్దికెర, బొజ్జనాయునిపేట గ్రామాలలో ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్‌లు అందజేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలంలో జీజీఎంపీ కార్యక్రమం పూర్తయిన సందర్భంగా సాయంత్రం మద్దికెరలో ఊరేగింపు నిర్వహించారు. బీరప్పడోళ్లు, బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. గ్రామ పురవీధుల గుండా ఎమ్మెల్యే ప్రజలకు అభివాదం చేస్తూ పాదయాత్ర చేశారు.

**ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ**

ఎం.అగ్రహారం గ్రామంలో నీటి సమస్య పరిష్కారం కోసం జల్‌జీవన్ మిషన్ కింద రూ.57.22 లక్షల నిధులతో చేపడుతున్న నీటి పథకానికి ఎమ్మెల్యే శ్రీదేవి భూమి పూజ నిర్వహించారు. ఈ నిధులతో 4 బోర్లు, పైపులైన్, 60 వేల లీటర్ల కెపాసిటీ ఓవర్‌హెడ్ ట్యాంక్, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతో నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సర్పంచులు విజయుడు, సుహాసిని, నాయకులు శాంతన్న, సుబ్బయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### మహిళాభ్యున్నతే లక్ష్యం



మెప్మా అర్బన్ బజార్‌ను ప్రారంభిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

**ఎమ్మిగనూరుటౌన్:** మహిళాభ్యున్నతే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను మున్సిపల్ చైర్మన్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు స్వయంగా తయారు చేసి విక్రయానికి ఉంచిన వస్తువులను పరిశీలించారు. మహిళలు స్వయం శక్తితో ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా రంగయ్య, యుకె రాజశేఖర్, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

### ఎల్లెల్సీకి 'పులికనుమ' నీరు

– తాగునీటి అవసరాల కోసం విడుదల



ఎల్లెల్సీలో ప్రవహిస్తున్న నీరు

**ఎమ్మిగనూరుటౌన్:** తాగునీటి అవసరాల కోసం పులికనుమ ప్రాజెక్టులో ఉన్న నీటిని ఎల్లెల్సీ ద్వారా గుడికల్ చెరువుకు బుధవారం అధికారులు మళ్లించారు. ఎమ్మిగనూరు పట్టణంలో మంచినీటి సమస్య తలెత్తకుండా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. పులికనుమ ద్వారా ఎల్లెల్సీకి 100 క్యూసెక్కుల నీటిని మళ్లించి గుడికల్ చెరువుకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో 10 క్యూసెక్కుల నీటిని తిమ్మారెడ్డి కుంటకు మళ్లించారు. ఎల్లెల్సీ ద్వారా సరఫరా అయ్యే నీటిని గుడికల్ చెరువులో నిలువ చేసి అక్కడి నుంచి ఎస్ఎస్ ట్యాంక్‌కు పంపి, ఫిల్టర్ అయిన నీటిని ఎమ్మిగనూరు పట్టణ ప్రజలకు సరఫరా చేస్తామని డీఈలు మనోహర్ రెడ్డి, లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. తుంగభద్ర డ్యాం నుంచి నీరు వచ్చే వరకు పులికనుమ నీరు పట్టణ వాసుల దాహార్తి తీర్చనుందని వారు పేర్కొన్నారు.